ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న రషీద్‌గూడ వాసులు

శంషాబాద్ రూరల్: ఔటర్ రింగు లోపల ఉన్న మండల పరిధిలోని పంచాయితీలను గ్రేటర్‌లో విలీనం చేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు బుధవారం ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. రషీద్‌గూడ, బహదూర్‌గూడ, చిన్నగోల్కొండ, హమీదుల్లానగర్ పంచాయితీలను గ్రేటర్ పరిధిలోకి తీసుకురావడానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను నిలిపివేయాలని కోరారు. ఈ ప్రాంతంలో పేదలు, కూలీలు ఎక్కువగా ఉండడంతో వారి ఆదాయం అంతంతమాత్రంగానే ఉందన్నారు. గ్రేటర్‌లో విలీనం చేస్తే ఆయా గ్రామాల ప్రజలపై పన్ను భారం పెరుగుతుందన్నారు. అంతేకాకుండా ఇక్కడ వివాదాస్పద భూములు, జీఓ 111 కారణంగా అభివృద్ధి జరగడంలేదన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో పీఏసీఎస్ చైర్మన్ బి.దౌనాకర్‌గౌడ్, నాయకులు నర్సింహా, జగన్‌మోహన్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, ధనపాల్‌రెడ్డి, ప్రభాకర్, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వనమహోత్సవం



వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బుధవారం వనమహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ప్రొఫెసర్లు, అధికారులు కలిసి వివిధ రకాల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ రఘురామిరెడ్డి మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ కాపాడాల్సిన భాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందన్నారు. అందరూ విరివిగా మొక్కలు నాటాలని, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తట్టుకోవడానికి మొక్కల పెంపకాన్ని ఉద్యమస్ఫూర్తితో చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, బోదన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ట్యాంకర్లను అరికట్టండి



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన సాయిగౌతం కాలనీ వాసులు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని సాయిగౌతమ్ కాలనీ వాసులు తమ కాలనీ మీదుగా అనుదినం వేగంగా రాకపోకలు సాగిస్తూ నివాసితులకు అసౌకర్యం కలిగిస్తున్న ప్రైవేటు నీటి ట్యాంకర్లను అరికట్టాలని నార్సింగి పోలీసులకు బుధవారం రాత్రి ఫిర్యాదు చేశారు. కాలనీ వాసులు తెలిపిన వివరాల ప్రకారం.. తమ కాలనీ పక్కన బోర్లు వేసుకుని నీటిని వ్యాపారానికి ఉపయోగిస్తున్నారన్నారు. కాలనీలో నుంచి అనునిత్యం వందలాది ట్యాంకర్లు రాకపోకలు సాగిస్తుండటంతో పిల్లలు, పెద్దలు బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. ట్యాంకర్లను వేగంగా నడుపుతూ ప్రమాదాలకు కారణం అవుతున్నారని, ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. వారిపై చట్టరీత్యా చర్య తీసుకుని తమని ట్యాంకర్ల బారి నుంచి కాపాడాలని ఫిర్యాదులో కోరారు.

ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదు



ఉద్యోగ విరమణ పొందిన హబిబ్‌ఖాన్‌ను సన్మానిస్తున్న అధికారులు

ఏజీవర్సిటీ: విశ్వవిద్యాలయంలో 34 ఎళ్లు డ్రైవర్‌గా విధులు నిర్వహించిన హబిబ్‌ఖాన్ బుధవారం ఉద్యోగ విరమణ చెందారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ నేపథ్యంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రారు రఘురామిరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ తప్పనిదని, ఉద్యోగి ఉద్యోగంలో చేరిన తరువాత తన ఉద్యోగ జీవితంలో పరిపూర్ణంగా తన విధులు నిర్వహిస్తూ సంస్థ పురోగతికి తోడ్పాడాలని అన్నారు. అంతేకాకుండా విశ్వవిద్యాలయానికి హబిబ్‌ఖాన్ అందించిన సేవలను కొనియాడారు.

33వ పశుపరాన్న జీవశాస్త్ర సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయంలో డిసెంబర్ 17 నుంచి 19 వరకు జరగనున్న 33వ జాతీయ పశుపరాన్న జీవశాస్త్ర సదస్సు బ్రోచర్‌ను బుధవారం విశ్వవిద్యాలయం ఉపకులపతి సభ్యసాచి గోష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువులలో పరాన్న జీవులు, వాటి వ్యాధుల వల్ల జంతువుల ఉత్పాదకత తగ్గి రైతులకు ఆర్థిక నష్టాన్ని చేకూరుస్తాయని, వీటివలన ప్రజారోగ్యం దెబ్బతింటుందని తెలిపారు. ఈ జాతీయ సదస్సులో దేశం నలుమూలల నుంచి శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, పశువైద్య పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు పాల్గొంటారన్నారు. అంతేకాకుండా పశు పరాన్న జీవుల యొక్క వివిధ అంశాల గురించి చర్చించి నియంత్రణకు కావల్సిన మార్గాలను కనుకోవడంతోపాటు వ్యాధులను ఎలా తగ్గించాలో చర్చిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ జ్ఞానప్రకాశ్, డీన్ రఘునందన్, ప్రిన్సిపాల్ ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

48వ వ్యవస్థాపక దినోత్సవం

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని భారతీయ నూనె గింజల పరిశోధన సంస్థ(ఐసీఎఆర్–ఐఐఒఆర్) 48వ వ్యవస్థాపక దినోత్సవం నేడు నిర్వహించడం జరుగుతుందని సంస్థ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నూనె గింజల పరిశోధనలో వివిధ పరిశోధనలు చేసి ఉత్తమ ఫలితాలు సాధించిన శాస్త్రవేత్తలకు, అలాగే ఉత్తమ రైతులకు అవార్డు అందజేయడం జరుగుతుందని తెలిపారు. దీంతో పాటు ఐసీఎఆర్–ఐఐఒఆర్ వారు అభివృద్ధి చేసిన నూతన వంగడాలు, నూతన కీట్లకు అందజేయడంతో పాటు రైతులకు ప్రయోగాత్మకంగా చూపించడం జరుగుతుందని అన్నారు.

నాటాల్సింది 1,62,000
నాటింది 55,342



- లక్ష్యానికి దూరంగా వనమహోత్సవం
- స్థలాల కొరత.. వర్షాభావ పరిస్థితులు
- మొక్కల లెక్కలు తగ్గుతున్నాయంటున్న అధికారులు

శంషాబాద్ రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వనమహోత్సవ కార్యక్రమానికి తూట్లు పడుతున్నాయి. పంచాయతీకి మొత్తం ఆరువేల మొక్కలు నాటాల్సి ఉండగా.. వివిధ ప్రాంతాల్లో 50..112.. 200 ఇలా నామమాత్రంగా నాటి చేతులు దులిపేసుకున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలో 27 పంచాయతీల్లో 1,62,000 మొక్కల చొప్పున నాటడం లక్ష్యంగా నిర్ణయించారు. అయితే బుధవారం వరకు కేవలం 55,342 మొక్కలు నాటారు. ఇంకా లక్షకు పైగా మొక్కలు నాటాల్సి ఉంది. లక్ష్యానికి చేరుకోవడానికి వర్షాభావ పరిస్థితులకు తోడు అనువైన స్థలాల కొరత నెలకొంది. జూలై 1 నుంచి వనమహోత్సవం ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే అధికారికంగా ప్రారంభోత్సవం చేపట్టినప్పటికీ.. ఆయా పంచాయతీల్లో మొక్కలను నాటుతున్నారు.



రామంజాపూర్‌లో మొక్కలు నాటుతున్న సిబ్బంది

స్థలాలు కరువు..

మండలంలోని 27 పంచాయతీల్లో మొక్కలు నాటేందుకు అనుకూలమైన స్థలాల కొరత ఉంది. ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వ ఖాళీ స్థలాలు, రోడ్ల వెంబడి, చెరువు కట్టలను గుర్తించారు. దీంతో మొదట్లో కేవలం 36,200 మొక్కలకు స్థలాన్ని కేటాయించారు. ఈ మేరకు చర్యలు చేపట్టగా.. మరింత స్థలాన్ని గుర్తించి ఇప్పటి వరకు 55 వేలకు పైగా మొక్కలు నాటారు.

పిల్లోనిగూడలో 50 మొక్కలే..

ప్రతి పంచాయతీకి ఆరు వేల మొక్కలు నాటాల్సి ఉండగా పిల్లోనిగూడ పంచాయతీ పరిధిలో ఇప్పటి వరకు కేవలం 50 మొక్కలు మాత్రమే నాటడం గమనార్హం. కాచారంలో 112, ముచ్చింతల్‌లో 200, మదన్‌పల్లిలో 300, ఘాంసిమియాగూడలో 750 మొక్కలు నాటారు. అత్యధికంగా రామంజాపూర్‌లో 4400 మొక్కలు నాటినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి.

నీటి కష్టాలు..

మండల పరిధిలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక మొక్కలకు నీటి కష్టాలు ఎదురవుతున్నాయి. నాటిన మొక్కలు ఎండిపోకుండా కూలీలు నీరు పోస్తున్నారు. జూలైలో సైతం లోటు వర్షపాతం నమోదైయింది. దీంతో ఓ వైపు మొక్కలు నాటుతూ.. మరో వైపు ఎండిపోకుండా నీళ్ల పోయాల్సి వస్తుంది.



మొక్కలకు ట్యాంకర్లతో నీరు పోస్తున్న దృశ్యం

ఆలయంలో ఒడి బియ్యం, అన్నదానం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని ఈదమ్మ, భూలక్ష్మమ్మ దేవాలయంలో గురువారం ఒడి బియ్యం, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు ప్రకటనలో తెలిపారు. ఆషాఢమాసం బోనాల పండుగను పురస్కరించుకొని భక్తులు ఈదమ్మ, భూలక్ష్మమ్మకు ఒడి బియ్యం సమర్పించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. భక్తులు సమర్పించిన ఈ ఒడి బియ్యాన్ని గురువారం దేవాలయం ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.



ఈదమ్మ, భూలక్ష్మమ్మ దేవాలయం

12 రోజుల్లోనే రూ.12 వేల కోట్లు రుణమాఫీ



బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్

బండ్లగూడ: వ్యవసాయం దండుగ కాదు.. పండుగ చేసి చూపిస్తానని తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ రైతుల పక్షపాతిగా నిలుస్తున్నారని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. బుధవారం బండ్లగూడలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేవలం 12 రోజుల్లోనే రూ.12 వేల కోట్ల రుణం మాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికి దక్కుతుందన్నారు. రైతుల సంక్షేమ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్దిని ఎవరు శంకించలేరని, తమ ప్రభుత్వం ప్రణాళికలను ఎవరూ ప్రశ్నించలేరంటూ సవాల్ విసిరారు. ఏకకాలంలో రూ.31 వేల కోట్లు కేటాయించి తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రైతుల రుణమాఫీ దేశ చరిత్రలోనే కొత్త రికార్డు సృష్టించిందన్నారు. ఇప్పటి వరకు ఏ రాష్ట్రం కూడా ఇంత పెద్ద మొత్తంలో రైతు రుణమాఫీ చేయలేదన్నారు. మంగళవారం మధ్యాహ్నం అసెంబ్లీ ప్రాంగణం నుంచి రైతు రుణమాఫీ రెండవ విడత నిధుల పంపిణీ కార్యక్రమం నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, కౌన్సిల్ చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కూలీన భారీ వృక్షం



రాజేంద్రనగర్: గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షం కారణంగా రాజేంద్రనగర్ ఆర్టీసీ డిపో ఆవరణలో భారీ వృక్షం మంగళవారం రాత్రి ఒక్కసారిగా కూలింది. ఈ వృక్షం కాస్తా ప్రహరీగోడపై పడి, అనంతరం పక్కనే ఉన్న బుద్వేల్ ప్రధాన రహదారిపై పడింది. ఈ సమయంలో రహదారిపై ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ చెట్టు కూలిన పక్కనే గుడిసెల్లో నివసిస్తున్న వారు తృటిలో ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. విషయం తెలుసుకున్న రాజేంద్రనగర్ జీహెచ్‌ఎంసీ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని, రోడ్డుపై పడిన మొక్కలను తీసివేశారు. ఆర్టీసీ అధికారులు ఉదయం సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

దశల వారీగా సమస్యలను పరిష్కరిస్తాం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్, తదితరులు

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్‌లో అభివృద్ధి లక్ష్యంగా చింతల్‌మెట్ నుంచి ఉప్పరపల్లి వైపు వెళ్లే ప్రధాన రహదారి సీసీ రోడ్డు అభివృద్ధి పనులు బస్తీ వాసులతో కలిసి బుధవారం అత్తాపూర్ కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్ రూ.9లక్షల95వేలతో అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇటీవలే హరినాథ్‌రెడ్డి కాలనీలో సీసీ రోడ్డు వేయించడం జరిగిందని, హుడాడ్ వర్క్ షాపు గుండా వెళ్లే రహదారి బీటీ రోడ్డు వేయించామని కాలనీ వాసులతో గుర్తు చేశారు. కాలనీ ప్రజలు మాట్లాడుతూ.. ఎప్పటికప్పుడు ఏ సమస్య ఉన్నా స్పందిస్తూ అనునిత్యం అందుబాటులో ఉంటారని హర్షం వ్యక్తం చేశారు. బస్తీలలో ఏ సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని, అధికారులతో చర్చించి దశల వారీగా సమస్యలను పూర్తి చేయిస్తానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సిద్దేశ్వర్, జీహెచ్‌ఎంసి వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, బస్తీవాసులు తదితరులు పాల్గొన్నారు.

అబ్బం కన్‌స్ట్రక్షన్‌పై కేసు నమోదు

రాజేంద్రనగర్: అబ్బం కన్‌స్ట్రక్షన్‌పై రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై రమేష్ వివరాల ప్రకారం.. బండ్లగూడ కార్పొరేషన్ కిస్మత్‌పూర్ అబ్బం కన్‌స్ట్రక్షన్ నిర్వాహకులు టవర్‌ను నిర్మాణం కోసం భారీ క్రేన్‌ను ఏర్పాటు చేశారు. గత కొంతకాలంగా పనులు కొనసాగుతున్నాయి. టవర్ పక్కనే ఓంనగర్ కాలనీ ఉంది. కాలనీలోని ఓ మహిళ మంగళవారం రాత్రి 7 గంటల ప్రాంతంలో తన కుమారుడికి అన్నం తినిపించేందుకు మిద్దెపైకి వెళ్లింది. ఇదే సమయంలో క్రేన్ సహాయంతో టవర్‌పై వస్తువులను భారీ ఇనుప బకెట్ సహాయంతో కిందికి తీసుకువస్తున్నారు. ఈ సమయంలో క్రేన్‌కు బిగించిన బకెట్ ఊడి కర్న అనే వ్యక్తి ఇంటిపై పడటంతో సదరు మహిళ భయంతో కిందికి దిగింది. భారీ శబ్దంతో రావడంతో చుట్టు పక్కల వారు భయభ్రాంతులకు గురై పనుల జరిగే చోటకెళ్లి ఆందోళనకు దిగారు. కర్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రతిభ ఆధారంగానే ఉద్యోగాలు



మాట్లాడుతున్న యాక్సెంచర్ ఎండీ అమిత్ సిన్హా

మణికొండ: ఇంజనీరింగ్, ఎంబీఏ పూర్తి చేసుకున్న విద్యార్థులకు వారి ప్రతిభ ఆధారంగానే ఉద్యోగాలు లభిస్తాయని, అందుకు అనుగుణంగా తమ ప్రతిభను పెంచుకునేందుకు విద్యార్థి దశ నుంచే కృషి చేయాలని యాక్సెంచర్ ఎండీ అమిత్ సిన్హా అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ, వట్టినాగులపల్లిలోని శ్రీదేవి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ప్లేస్‌మెంట్ టాక్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువులతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, ఆంగ్లభాషపై సంపూర్ణపట్టు, క్రియేటివిటీ ఎక్కువ ఉండాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. అన్ని రంగాలలో రాణించే వారినే సంస్థలు తమ ఉద్యోగులుగా ఎంచుకునేందుకు ముందుకు వస్తాయన్నారు. ఉద్యోగాలలో చేరిన తరువాత సైతం నిత్యవిద్యార్థిగా వ్యవహరించినపుడే రాణించే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. నర్మద, పలు విభాగాల డీన్‌లు, అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్ బదిలీ



ఇన్‌స్పెక్టర్‌ని సత్కరించిన ట్రాఫిక్ సీఐ నిరంజన్‌రెడ్డి తదితరులు

మణికొండ: నార్సింగి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ అదనపు ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన జె. కృష్ణను సైబరాబాద్ కమిషనర్ కార్యాలయానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో సైబరాబాద్ సెక్యూరిటీ వింగ్ నుంచి ప్రదీప్‌ను బదిలీ చేశారు. దీంతో బుధవారం బదిలీపై వెళ్తున్న కృష్ణను ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. రెండు సంవత్సరాల పాటు తన సేవలతో నార్సింగి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సేవలు అందించి మన్ననలు పొందారని ఇన్‌స్పెక్టర్ అన్నారు.

అనాథ వృద్ధుడు ఆశ్రమానికి తరలింపు



వృద్ధుడిని ఆశ్రమానికి తరలిస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని మధుబన్ కాలనీలోని ప్రధాన రహదారిపై ఉన్న మతిస్థిమితం లేని ఓ వృద్ధుడి పడి ఉన్నాడు. స్థానికులు సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు అడిగినా చెప్పకపోవడంతో ఆకలిగా ఉన్న ఆ వృద్ధుడికి అన్నం పెట్టి, బట్టలు వేశారు. మంగళవారం సాక్షిలో 'వృద్ధుడికి పోలీసుల సపర్యలు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ నరేందర్ స్పందించారు. నాదర్గుల్‌లోని మాతృదేవోభవ అనాథ ఆశ్రమం నిర్వాహకుడు గట్టుగిరి దృష్టికి తీసుకెళ్లగా బుధవారం వృద్ధుడిని ఆశ్రమానికి తరలించారు.

నిషేధిత ప్లాస్టిక్ కవర్ల విక్రయ దుకాణాలపై దాడులు



ప్లాస్టిక్ కవర్ల విక్రయాలపై దాడులు నిర్వహిస్తున్న అధికారులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది బుధవారం నిషేధిత ప్లాస్టిక్ కవర్లను ఉపయోగిస్తున్న దుకాణాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నిషేధానికి గురైన ప్లాస్టిక్ కవర్లలో వస్తువులను అందజేయడాన్ని గుర్తించి సీజ్ చేశారు. మరికొందరు వ్యాపారులకు రూ.500ల నుంచి రూ.1000ల వరకు అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా ఉప కమిషనర్ రవి కుమార్ మాట్లాడుతూ... వ్యాపారస్తులు వినియోగదారునికి జూట్ బ్యాగ్‌లలో లేదా ప్రభుత్వం అనుమతించిన ప్లాస్టిక్ కవర్లలోనే వస్తువులను అందించాలన్నారు. నిషేధించిన ప్లాస్టిక్ కవర్లను వాడితే జప్తు చేస్తామన్నారు. జప్తుతో పాటు అపరాధ రుసుము విధిస్తామన్నారు. ఈ విషయాన్ని గమనించి వ్యాపారస్తులు నిషేధిత ప్లాస్టిక్ బ్యాగ్‌లను వాడవద్దని సూచించారు.

సీఎం క్షమాపణ చెప్పాలి

రాజేంద్రనగర్: మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిపై అనుచిత వ్యాఖ్యాలు చేసిన సీఎం రేవంత్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని రాజేంద్రనగర్ డివిజన్ జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్ డిమాండ్ చేశారు. శివరాంపల్లిలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్పొరేటర్ మాట్లాడారు. అసెంబ్లీ సాక్షిగా సీఎం ఒక మహిళపై అనుచిత వ్యాఖ్యాలు చేయడం సరికాదన్నారు. సబితా ఇంద్రారెడ్డిని అసెంబ్లీలో ఎదుర్కోలేక వేధిస్తున్నట్లు స్పష్టమవుతుందన్నారు. సీఎం మాటలను సమర్థించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు.

మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



హల్లాలేని ఇంటి వద్ద అక్రమ అరెస్ట్ చేసిన పోలీసులు

అత్తాపూర్: అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు బుధవారం తెల్లవారు జామున అత్తాపూర్ డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు ఉమ హల్లాలేని పోలీసులు ఔట్ పోస్ట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హామీలు నెరవేర్చలేని సీఎం రేవంత్ రెడ్డి గద్దె దిగాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఏర్పడగానే ప్రతి మహిళకు నెలకు రూ.2,500లు అకౌంట్లో వేస్తామని, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తామని, రూ.500లకు గ్యాస్ సిలిండర్ ఇస్తామని, ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తామని, మహిళలకు పూర్తి రక్షణ కల్పిస్తామని నమ్మబలికిన సీఎం రేవంత్ రెడ్డి మహిళలను గౌరవించకుండా పోలీసులను అడ్డుపెట్టుకుని రాష్ట్ర మహిళలందరికి మొండిచెయ్యి చూపిస్తున్నారని ఆరోపించారు.

తేలని ట్యాక్సీ డ్రైవర్ల పంచాయితీ

శంషాబాద్: ఎయిర్‌పోర్టులో ట్యాక్సీ డ్రైవర్ల పంచాయితీతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇతర రాష్ట్రాల రిజిస్ట్రేషన్ ఉన్న వాహనాలు ఓలా, ఉబర్ సంస్థలు ప్రోత్సహిస్తుండడంతో తమ ఉపాధి కోల్పోతున్నామని రెండోరోజు నిరసన వ్యక్తం చేశారు. దీంతో ట్యాక్సీలు పూర్తి స్థాయిలో నడవకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వాహనాలు పెద్ద సంఖ్యలో ఉన్నా రవాణశాఖ అధికారులు, సైబరాబాద్ పోలీసులు, జీఎంఆర్ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్‌టీఏ, సైబరాబాద్ పోలీసులు, జీఎంఆర్ అధికారులు వెంటనే సమావేశం ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని గిగ్‌ప్లాట్ ఫాం వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సలావుద్దీన్ డిమాండ్ చేశారు.

ముందస్తు అరెస్టు



గేటెడ్ కమ్యూనిటీలోని పద్మ ఇంటికి వెళ్లిన నార్సింగి పోలీసులు



ఇందిరరెడ్డిని అరెస్టు చేసిన రాయదుర్గం పోలీసులు

మణికొండ: ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న నాయకులను ముందస్తు అరెస్టులు చేసి భావస్వేచ్చను రాష్ట్ర ప్రభుత్వం హరిస్తుందని బీజేపీ మహిళా మోర్చ జిల్లా కార్యదర్శి సీహెచ్. ఇందిరరెడ్డి, నార్సింగి మున్సిపాలిటీ మహిళా మోర్చ అధ్యక్షురాలు జె.పద్మలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు బుధవారం అసెంబ్లీ ముట్టడికి వెళ్తామన్న ఉద్దేశంతో నార్సింగి, రాయదుర్గం పోలీసులు తమను ముందస్తు అరెస్టులు చేశారన్నారు. ఉదయం నిద్రలేవక ముందే గేటెడ్ కమ్యూనిటీలు, గృహాల వద్దకు వచ్చి మహిళలు అనిసైతం చూడకుండా స్టేషన్‌లకు తీసుకుని వెళ్లడం దారుణమన్నారు. అలాంటి హక్కులు వారికి ఎవరు ఇచ్చారంటూ ప్రశ్నించారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రతి ఒక్కరు ఉద్యమం, పోరాటాలు చేసే అవకాశం ఉంటుందని, అలాంటి వాటిని ప్రతిపక్షాలు గొంతు లేపే అవకాశం లేకుండా ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఎన్నికల సమయంలో ఇష్టారాజ్యంగా హామీలు ఇవ్వటం, అధికారంలోకి వచ్చాక ప్రతిపక్షాలను కట్టడి చేయటం మంచి పద్ధతి కాదన్నారు. తమ గృహాలకు వస్తున్న పోలీసులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా పోరాటం చేస్తామన్నారు.